RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 291

శనివారం
అక్టోబర్ 25, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00



పాఠశాలను సందర్శించిన జిల్లా అధికారి

3లో..

- బస్సు బుగ్గి.. అందులో 44 మంది ప్రయాణికులు
- మృతుల్లో ఆరుగురు తెలంగాణ వాసులు
- రూ.5 లక్షల పరిహారం ప్రకటించిన తెలంగాణ సర్కార్
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం :మంత్రి పొన్నం ప్రభాకర్



# 19 మంది సజీవదహనం..!?

**వేద న్యూస్, డెస్క్:**

ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ఓ ట్రావెల్స్ బస్సు (కావేరి ట్రావెల్స్)ను కర్నూలు శివారులోని చిన్నటేకూరులో హైవే 44పై ఓ బైక్ ఢీకొట్టింది. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో బైక్ బస్సు కిందకు దూసుకెళ్లడంతో మంటలు చెలరేగాయి. క్రమంగా అవి బస్సు మొత్తం వ్యాపించాయి. చూస్తుండగానే బస్సు అగ్నికి ఆహుతైంది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 44 మంది ఉండగా, 19 మంది సజీవ దహనమయ్యారు. మృతిచెందిన వారిలో ఆరుగురు తెలంగాణ వాసులున్నారు.

**- తెలంగాణ పౌరులకు రూ.5 లక్షల పరిహారం**

కర్నూల్ జిల్లా బస్సు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. అలాగే బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం ప్రకటించింది. ప్రమాదంలో చనిపోయిన తెలంగాణ పౌరులకు రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.2 లక్షల ఆర్థికసాయం చేయనున్నట్లు తెలిపింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.





## 'విద్య రాని వ్యక్తి విద్యా శాఖ మంత్రి'

- తక్షణమే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్
- పెట్టుబడులు, పాలనా వైఫల్యంపై విమర్శ


**వేద న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 24 :**

తెలంగాణ మాజీ మంత్రి మరియు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పై సంచలన వ్యాఖ్యలు చేశారు. విద్యా శాఖ మంత్రిగా, మున్సిపల్ మంత్రిగా, హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఫెయిల్ అయ్యారని ఆయన తీవ్రంగా విమర్శించారు. అయితే, కలెక్షన్ల మంత్రిగా, వసూళ్ల మంత్రిగా మాత్రం పాస్ అయ్యారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ పనితీరును విమర్శిస్తూ హరీశ్‌రావు సంచలన ఆరోపణలు చేశారు. "విద్య రాని వ్యక్తి విద్యా శాఖ మంత్రి. అతి ఎక్కువ క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తి హోం మంత్రిగా ఉన్నారు," అని ఆయన విమర్శించారు. జాబులు నింపండి అంటే, జేబులు నింపుకుంటున్నారని, గల్లా పెట్టెలు నింపుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. గతంలో జీవో 29, జీవో 55 పై తాను

మిగతా 4వ పేజీలో..

## గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య

**వేద న్యూస్, హనుమకొండ, అక్టోబర్ 24 :**



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలోని పీవీ రంగారావు గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని వనం శ్రీ వర్షిని ఆత్మహత్యకు పాల్పడడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఉదయం పాఠశాలలోని డార్మెంటరీ గదిలో ఆమె ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. మృతి చెందిన విద్యార్థిని కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందినదిగా గుర్తించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు పాఠశాలకు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని శ్రీ వర్షిని దీపావళి సెలవుల అనంతరం ఈరోజే పాఠశాలకు తిరిగి వచ్చిందని సమాచారం. పాఠశాలకు వచ్చిన తర్వాత ఆమె ఉపాధ్యాయురాలి ఫోన్ నుండి తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి, తనను వెంటనే

మిగతా 4వ పేజీలో..

## వరంగల్ ను అభివృద్ధి చేయడమే లక్ష్యం

- ఎంపీ డా.కడియం కావ్య

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



వరంగల్ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, ప్రత్యేక ప్రాజెక్టల పురోగతిపై కలెక్టరేట్ లో శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదతో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి మంజూరైన పలు స్కీములు, ప్రజాప్రయోజన పనులపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ జిల్లా అభివృద్ధి వేగం మరింత పెంచడానికి కేంద్ర నిధులను సమర్థవంతంగా వినియోగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్ళను వెంటనే క్లియర్ చేసి ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. జిల్లాలో రహదారులు, నీటి పారుదల, విద్య, ఆరోగ్య విభాగాల్లో ప్రాధాన్యత ఆధారంగా కేంద్ర ప్రభుత్వం నుండి అదనపు నిధులు కేటాయించేలా ప్రయత్నాలు చేస్తానని ఎంపీ డా. కడియం కావ్య తెలిపారు. వరంగల్ అభివృద్ధి విషయంలో వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో తన గళాన్ని వినిపిస్తానని ఎంపీ స్పష్టం చేశారు. జిల్లా ప్రజలు ఆశిస్తున్న అభివృద్ధి దిశగా కృషి చేస్తానని ఎంపీ పేర్కొంటూ, వరంగల్‌ను జాతీయ స్థాయిలో ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యం అని తెలిపారు.

## పాకిస్థాన్‌కు మరో భారీ షాక్



**వేద న్యూస్, కాబూల్/ఇస్లామాబాద్, అక్టోబర్ 24 :**


ఇప్పటికే భారత్‌తో జల వివాదాలతో సతమతమవుతున్న పొరుగు దేశం పాకిస్థాన్‌కు తాలిబన్ల పాలనలోని ఆఫ్ఘనిస్థాన్ గట్టి షాక్ ఇచ్చింది. పాకిస్థాన్‌కు ప్రవహించే కీలకమైన కునార్ నదిపై భారీ డ్యామ్‌ను నిర్మించి, నీటి ప్రవాహాన్ని నియంత్రించాలని నిర్ణయించింది. ఈ మేరకు డ్యామ్ నిర్మాణ పనులను వీలైనంత వేగంగా ప్రారంభించాలని తాలిబన్ సుప్రీం లీడర్ మౌల్వీ హిబతుల్లా అఖుంద్జాదా జల, ఇంధన మంత్రిత్వ శాఖను ఆదేశించారు. ఇరు దేశాల మధ్య ఇటీవలే జరిగిన భీకర సరిహద్దు ఘర్షణల్లో

మిగతా 4వ పేజీలో..

## హైదరాబాద్ ఉప్పల్‌లో పట్టపగలే చైన్ స్నాచింగ్

- దొంగను పట్టుకున్న స్థానికులు - ఉప్పల్ సెవెన్ హిల్స్ కాలనీలో కలకలం

**హైదరాబాద్, అక్టోబర్ 24 (శుక్రవారం):**



హైదరాబాద్‌లోని ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. సెవెన్ హిల్స్ కాలనీలో పట్టపగలే ఓ మహిళ మెడలోంచి గొలుసు లాక్కెళ్లేందుకు ప్రయత్నించిన దొంగను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఈ మొత్తం ఘటన సమీపంలోని సీసీటీవీ కెమెరాలో రికార్డయింది. వివరాల్లోకి వెళితే, సెవెన్ హిల్స్ కాలనీలో ఓ మహిళ రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా, ఆమెను వెంబడించిన దుండగుడు అదును చూసి మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో తేరుకున్న మహిళ గట్టిగా కేకలు వేసింది.

**- దొంగను వెంబడించి పట్టుకున్న స్థానికులు**

మహిళ అరుపులు విన్న వెంటనే అప్రమత్తమైన స్థానికులు, చుట్టుపక్కల వారు వెంటనే స్పందించారు. పారిపోతున్న దొంగను వెంబడించి, కొంత దూరంలోనే అతడిని సాహసోపేతంగా పట్టుకున్నారు. అనంతరం ఆగ్రహంతో అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పట్టపగలే ఇలాంటి ఘటనలు జరగడంతో స్థానికులు తమ భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజలకు ఆహ్లాదకర వాతావరణమే లక్ష్యం

- నిర్మాణ స్థలం ఆకస్మిక తనిఖీ - కబ్జా నివారణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

**వేద న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 24 :**



తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈరోజు హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45 లో నిర్మాణంలో ఉన్న జీహెచ్‌ఎంసీ 'పెట్ అండ్ ప్లే పార్క్' పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు వివాహ శుభకార్యాలకు హాజరై తిరిగి వస్తున్న సందర్భంలో ముఖ్యమంత్రి ఆ పార్క్ వద్ద ఆగి, అక్కడ జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా జరిగిన ఈ తనిఖీ, స్థానిక యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది.

**- కబ్జా నివారణకు ముఖ్యమంత్రి ఆదేశాలు**

ఈ పార్క్ నిర్మాణం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రారంభమైంది. గతంలో ఈ ప్రభుత్వ స్థలం చెత్తా చెదారంతో నిండిపోయి, నిరుపయోగంగా ఉండేది. ముఖ్యంగా, విలువైన ఈ స్థలం కబ్జాకు గురికాకుండా నివారించడానికి, ఆ ప్రాంతంలో ప్రజలకు ఉపయోగపడేలా పార్క్ నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి గతంలో జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములను కాపాడాలనే ఆయన నిబద్ధతకు అనుగుణంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు.

**తుది దశ పనుల పరిశీలన, సూచనలు**

ప్రస్తుతం పార్క్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి పార్క్‌లో జరుగుతున్న పనులను ఆకస్మికంగా పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. పనుల వేగం, నిర్మాణంలో ఉన్న లోపాల గురించి అధికారులతో చర్చించి, వాటిని త్వరగా పూర్తి చేయడానికి సంబంధించి అవసరమైన పలు సూచనలు మరియు ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్టు త్వరగా అందుబాటులోకి వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

**- శ్రమజీవులను ఆప్యాయంగా పలకరించిన ముఖ్యమంత్రి**

తనిఖీ సందర్భంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం పనులను మాత్రమే కాకుండా, అక్కడ పనిచేస్తున్న కూలీలపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. పార్క్‌లో పనిచేస్తున్న కూలీలను దగ్గరకు పిలిచి

మిగతా 4వ పేజీలో..

వేద న్యూస్
శనివారం అక్టోబర్ 25, 2025

# ఊరుగొండ హైస్కూల్ సందర్శన



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

హనుమకొండ జిల్లాలో శుక్రవారం ప్రారంభమైన ఉన్నత పాఠశాల విద్యార్థుల సమ్మేటివ్ వన్ పరీక్షలను దామెర మండలం ఊరుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి డాక్టర్ బి. రాంధన్, సహాయ కార్యదర్శి జి.ప్రసన్న కుమార్ పరిశీలించారు. ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు శుక్రవారం నుండి ఈనెల 31 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై. సత్యనారాయణతో కలిసి స్కూల్లోని వివిధ గదులలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రశ్నపత్రంలో ఏవైనా అచ్చు తప్పులు దొర్లాయా అని అడిగారు. వివిధ సామర్థ్యాలపై విద్యార్థులకు ఏ విధమైన నైపుణ్యముందో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

# క్రీడలు ప్రారంభం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల రెండవ దఫా క్రీడలు వర్సిటీ మైదానంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేయూ విసి ఆచార్య కే.ప్రతాపరెడ్డి , ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మనోహర్, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య పాల్గొన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ ఎస్ కుమారస్వామి వ్యవరించారు. ఈ క్రీడలు మూడు రోజులపాటు జరుగుతాయని, మొత్తం ఐదు క్రీడలలో సాఫ్ట్ బాల్, బాల్ బ్యాడ్మింటన్, ఖోఖో, హ్యాండ్ బాల్, శనివారం నాడు ఉదయం 5 గంటలకు క్రాస్ కంట్రీ జరుగుతుంది. ఈ కార్యక్రమంలో దాదాపు 500ల మంది విద్యార్థులు ఉమ్మండి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుండి పాల్గొనడం జరిగింది. క్రీడలతోపాటు కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేస్తారని ఆర్గనైజేషన్ సెక్రటరీ డాక్టర్ ఎస్. కుమారస్వామి తెలిపారు. నూతనంగా ఏర్పడిన కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జె. సోమన్న, సెక్రెటరీ డాక్టర్ కే సునీల్ రెడ్డి, ట్రెజరర్ ఎస్.కిరణ్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ బొల్లం రమేష్, కమిటీ సభ్యులు విసికి యూనివర్సిటీ క్రీడల అభివృద్ధికి సంబంధించి పలు ప్రతిపాదనలు చేశారు. విసి వెంటనే స్పందిస్తూ కాకతీయ యూనివర్సిటీ క్రీడల అభివృద్ధికి అన్నివేళలా తాను తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు ముఖ్యపాత్ర పోషిస్తాయని క్రీడలవల్ల మానసిక, శారీరక, సాంఘిక పరిపక్వత పెరుగుతుందని ప్రతి ఒక్కరూ క్రీడలలో పాల్గొని వారి యొక్క ఆరోగ్యాన్ని సైతం మెరుగుపరుచుకోవాలని సూచిస్తూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్న మాటను గుర్తు చేశారు. ప్రతి వ్యక్తి వారి దినచర్యలో వ్యాయామానికి తగిన




ప్రాధాన్యత ఇవ్వాలని, వీసీ గారు క్రీడల పట్ల తనకున్న అనుభవాన్ని గుర్తు చేశారు.

# సైకిల్ ర్యాలీ



## - జెండా ఊపి ప్రారంభించిన సీఐ రేణుక రెడ్డి

**వేద న్యూస్, పెద్ద శంకరంపేట :**

పోలీస్ సంస్మరణ దినోత్సవం సందర్భంగా పెద్ద శంకరంపేట పట్టణంలో అల్లాదుర్గ సిఐ రేణుక రెడ్డి ,పేట ఎస్సై ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో పలు పోలీస్ స్టేషన్ల సిబ్బంది తో విద్యార్థులు యువత పెద్ద శంకరంపేట పట్టణంలో సైకిల్ యాత్రను నిర్వహించారు.. ఈ సైకిల్ యాత్రను సిఐ రేణుకా రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి సేవ చేసిన సైనికులు వీర జవాన్లు త్యాగాల స్మరించుకునే రోజు అని ప్రతి పౌరుడు దేశ పతాకం పట్ల గౌరవం కలిగి ఉండాలి అని అన్నారు.ఈ ర్యాలీలో పట్టణంలోని పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలు చేతబట్టి దేశభక్తి నినాదాలు చేస్తూ పోలీస్ సిబ్బందితో సైకిల్ యాత్ర నిర్వహించారు.

# ప్రజాకవి కాళోజి తొమ్మిదవ స్మారకోపన్యాసం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

సృష్టికి ప్రతి సవాలు విసిరింది తెలంగాణా కళ అని హైదరాబాద్ డిపార్టుమెంటు ఆఫ్ లాంగ్వేజ్ అండ్ కల్చర్, గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణా సంచాలకులు డాక్టర్ నరసింహ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ సెనెట్ హాల్లో, శుక్రవారం కేయూ విసి ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజి నారాయణ రావు 9వ స్మారక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. విసి కాళోజి చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కీలక ఉపన్యాసం చేసిన నరసింహారెడ్డి మాట్లాడుతూ సాయుధపోరాటం, తొలి,మలి దశ ఉద్యమాలు : కవిత్వం అనే అంశంపై స్మారక ఉపన్యాసం చేసారు. తెలంగాణా కేంద్ర బిందువు వరంగల్ అని, కాళోజి స్వేచ్ఛకు, ఇచ్చకు, ప్రతీకా అని, మనస్సులో మాట బహిరంగంగా వెల్లడించే మనస్తత్వం, తెలంగాణా గొప్ప సృజనా కారులకు నిలయం అన్నారు. ఎక్కడ సంఘర్షణ ఉంటుందో, అక్కడ సృజన ఉంటుందన్నారు. సాహిత్యం, కళలు ఎక్కువగా అభివృద్ధి చెందింది తెలంగాణాలో నే అని తెలిపారు. మొదటి దశ ఉద్యమం, మలి దశ ఉద్యమం 2014లో వచ్చిన ఉద్యమాల్లో కవిత్వం ప్రధాన భూమిక వహించిందని చెప్తూ, ఎంతో మంది కళాకారులూ, వారి కవితలను, పాటలను సమాజం ముందు ఉంచారు. సోషల్ మీడియా లేని కాలంలోనే కవిత్వం ముఖ్య భూమిక పోషించిందని వివరించారు. కవిత్వం ద్వార ఫర్మానాలు వచ్చాయని, సాయుధ పోరాట సమయంలో గొప్ప సాహిత్యం బయటకొచ్చిందని, నూరేళ్ళ చరిత్రలో ఎంతో గొప్ప కవిత్వం తెలంగాణ సమాజానికి ఉపయోగపడిందని, తెలంగాణా గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసిన అవసరం నేటి విద్యార్థులకు అవసరమన్నారు. ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణా ఉద్యమంలో కవుల పాత్ర, కవిత్వాలు అమోఘమన్నారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు వారి సబ్జెక్టుకే పరిమితం కాకుండా, సాహిత్యం, కళలపై కూడా




దృష్టి పెట్టాలన్నారు. డాక్టర్ అంపశయ్య నవీన్ మాట్లాడుతూ ప్రపంచానికి కాళోజిని అందించింది. పొట్లపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మానవత్వానికి నిలువెత్తు సంతకం కాళోజి అన్నారు. వి. ఆర్. విద్యార్థి కాళోజి ఫౌండేషన్ గురించి వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం కీలక ఉపన్యాసం చేసిన నరసింహారెడ్డిని పరిచయం చేసారు.

# మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడికి ఘన సన్మానం

## -సంఘం సభ్యత్వ నమోదు బుక్కులు పంపిణీ

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయి నిపల్లి మండలం మునురు కాపు సంఘం ఆధ్వర్య ంలో రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ను కూరగాయల మల్లేష్,అలాగే మండల కాపు సంఘం ఆధ్వర్యం లో శాలువతో సన్మానం చేశారు. అనంతరం సంఘం సభ్యత్వ నమోదు బుక్కులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాములు, ప్రధాన కార్యదర్శి అమ్మిశెట్టి భూమిరెడ్డి, జిల్లా సవిత కార్యదర్శి చిందం రమేష్, రాధ, అంజయ్య, వివిధ గ్రామాలనుంచి వచ్చిన అధ్యక్ష, కార్యదర్శులు 23 గ్రామాల కుల బంధువులు పాల్గొనడం జరిగినది ఈ కార్యక్రమంలో బుర్ర రాజు, నంది సత్తయ్య,మాశెట్టి జనార్దన్, చేపు సుధాకర్, మైపాల్,రాంబాబు, పాల్గొన్నారు.

# సాయి మణి దీపిక ముదిరాజ్ కు సన్మానం


**వేద న్యూస్, హన్మకొండ:**



ఇటీవల కాలంలో తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఎంబిబిఎస్ ఫలితాల్లో హనుమకొండ గుడిబండల్ ప్రాంతానికి చెందిన కాటబోయిన శివ శివరంజని ముదిరాజ్ ల కూతురు సాయి మణి దీపిక ముదిరాజ్ 435 మార్కులు సాధించి కామినేని లో సీటు పొందారు.ఈ సందర్భంగా మెపా హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు గోనెల విజేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో, మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్,రాష్ట్ర ,జిల్లా కమిటీ సభ్యులు ముఖ్య అతిథిగా పాల్గొని గుడిబండల్ లోని సాయి మణి దీపిక ముదిరాజ్ నివాసానికి వెళ్లి కేక్ కట్ చేసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు మార్కులు కొలమానం కాదని, పిల్లల ప్రతిభ ఆధారంగా ఇష్టమైన చదువును ఎంచుకోవాలని,అందుకు సాయి మణి దీపిక నే ఆదర్శం అన్నారు.అనంతరం సాయి మణి దీపిక ముదిరాజ్ మాట్లాడుతూ ర్యాంక్ ల కోసం ఆరాటపడవద్దని, ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని,పాత ప్రశ్న పత్రాలు పునర్విమర్శన చేసుకోవాలని బట్టి చదువుకు స్వస్తి పలకాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు ముదిరాజ్ , హనుమకొండ 8వ డివిజన్ ఉపాధ్యక్షులు గోనెల శివ రాజు, ప్రధాన కార్యదర్శి పులి మహేష్ ముదిరాజ్ ,యూత్ అధ్యక్షులు గోనెల సాగర్ ముదిరాజ్ ,తల్లి తండ్రులు కాటబోయిన శివ, శివ రంజని ముదిరాజ్ లు పాల్గొన్నారు.

# కలెక్టర్ ను కలిసిన ఆర్డి ఓ

**వేద న్యూస్,వరంగల్ :**



వరంగల్ ఆర్డిఓ గా పదవి బాధ్యతలు చేపట్టిన టి.సుమా శుక్రవారం జిల్లా కలెక్టర్ డా.సత్య శారదను శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆర్డిఓ కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం వరంగల్ ఆర్డి ఓ గా నియమితులైన సుమా గతం లో పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ ఆక్విజెషన్) గా సేవలు అందించారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామ సమీపంలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కరీంనగర్ నుంచి వేములవాడ వైపు అతివేగంగా వస్తున్న టాటా ఏసీ గూడ్స్ వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి, రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి, అనంతరం అటువైపుగా వస్తున్న ఒక ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టాటా ఏసీ వాహనం, ద్విచక్ర వాహనం ధ్వంసం అయ్యాయి..ప్రమాదానికి గల కారణాలపై స్థానికులు పలు వివరాలు తెలిపారు. టాటా ఏసీ వాహనం డ్రైవర్‌కు ఒక్కసారిగా స్టీరింగ్ లాక్ కావడంతోనే వాహనం అదుపుతప్పి ఈ ఘోరం జరిగిందని వారు చెప్పారు. ప్రమాదానికి గురైన టాటా ఏసీ వాహనం కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందినదిగా గుర్తించారు. ద్విచక్ర వాహనం గోపాలరావుపేట గ్రామానికి చెందినదిగా సమాచారం అందింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.



# పాఠశాలను సందర్శించిన జిల్లా అధికారి

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కంది కట్కూర్ గ్రామంలో (ఎస్సీ కాలనీ ) రైలు బడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అంగన్వాడి సెంటర్ ను సందర్శించిన రాజన్న సిరిసిల్ల జిల్లా చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సిడిపిఓ) ఉమారాణి పాఠశాలలో (ఏక్ పేడ్ మాకే నామ్) తెలంగాణ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో మొక్కలను నాటడం జరిగింది. ఈ సందర్భంగా( సిడిపిఓ) చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ ఉమారాణి మాట్లాడుతూ ప్రతి అంగన్వాడి సెంటర్లో.పాఠశాలల్లో విద్యార్థులు తల్లిదండ్రుల చేత మొక్కలు నాటించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల.ప్రధానోపాధ్యాయులు బద్దం రవీందర్ రెడ్డి. ఉపాధ్యాయులు అనువోజు రాజుగారు, ఐ సి డి ఎస్ సూపర్వైజర్లు. అంగన్వాడీ టీచర్ లక్ష్మి.విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# వైద్యం వికటించి బాలుడి పరిస్థితి విషమం

- మెరుగైన వైద్యం కోసం సిరిసిల్లకు తరలింపు
- ఆందోళనలో తల్లిదండ్రులు

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

ఓ బాలుడికి జ్వరం రావడంతో స్థానిక ఆర్ఎంపి వైద్యునికి చూపించడంతో ఇంజక్షన్స్, సెలెన్స్ పెట్టి ఐ డోస్ చికిత్స అందించడంతో బాలుడు అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఘటన ఎల్లారెడ్డిపేట మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు రాచర్ల గుండారం గ్రామానికి చెందిన పండుగ దేవేందర్ బాలమణి దంపతుల కుమారుడు పండుగ శివన్న (7) గత ఐదు రోజుల క్రితం జ్వరం రావడంతో అదే గ్రామానికి చెందిన ఓ ఆర్ ఎం పి వద్దకు తీసుకెళ్లగా ఇంజక్షన్స్ తోపాటు మందులు, గ్లూకోస్ పెట్టి అచ్చిరాని వైద్యం అందించడంతో తమ కుమారునికి ఒళ్లంతా దద్దులు పైకి తేలి అపస్మానిక స్థితిలోకి వెళ్లాడని ఆరోపించారు. వెంటనే దేవేందర్ భార్య బాలమణి గత రాత్రి మెరుగైన వైద్యం కోసం సిరిసిల్లాలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. బాలుడి పరిస్థితి కొత్త విషమంగా ఉన్నట్లు డాక్టర్లు పేర్కొన్నారని మీడియాతో తెలిపారు. అచ్చిరాని వైద్యం అందించి తమ కుమారునీ ఆరోగ్యంతో చెలగాటమాడారని వైద్యులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కాగా బాలుడి తండ్రి దేవేందర్ ఉపాధి నిమిత్తం వారణాసిలో ఉన్నట్లు పేర్కొన్నారు.

## గంజాయి నిందితులకు
# ఏడేళ్ల జైలు

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :**

ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండలో గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు జిల్లా కోర్టు 7 సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం 2021 అక్టోబర్ 25న వర్షకొండ శివారులో ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన గిద్దె వినోద్ (25), నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలానికి చెందిన జాధవ్ రంజిత్ (25) అనే ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులిద్దరూ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో గంజాయిని ఒక వ్యాపారంగా మార్చుకున్నారని ఎస్ఐ అనిల్ కుమార్ అన్నారు. ఈ కేసును శుక్రవారం జిల్లా కోర్టు విచారించి గంజాయి విక్రయించన ఇద్దరికీ ఏడేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి ఇరవై వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. గంజాయి పెంపకం, అమ్మకం, సరఫరా చేయడం చట్ట విరుద్ధమని, మత్తు పదార్థాల అక్రమ వ్యాపారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి మెట్పల్లి సిఐ ఎల్ శ్రీను, ఇబ్రహీంపట్నం ఎస్ఐ రాజప్రమీల, పిపికే మల్లికార్జున్, సిఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ రంజిత్, సిఎంఎస్ కానిస్టేబుల్ రాజులను జిల్లా ఎస్పీ ఆశోక్ కుమార్ అభినందించారు.

# రైతులకు సబ్సిడీ ద్వారా వివిధ రకాల పనిముట్లు


**వేద న్యూస్,శాయంపేట:**

రైతులకు సబ్సిడీ ద్వారా వివిధ రకాల పనిముట్లు అందజేయబడుతుందని మండల వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా (సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్)2025-26 ఆర్థిక సంవత్సరానికి శాయంపేట మండల రైతులకు వివిధ రకాల పనిముట్లను సబ్సిడీ కింద అందజేయడం జరుగుతుంది అన్నారు .వాటి యొక్క వివరాలు బ్యాటరీ స్ప్రేయర్లు- 141, పవర్ స్ప్రేయర్లు- 29, రోటావేటర్లు- 7, ఎరువు-విత్తన డ్రిల్ - 2,కల్టివేటర్లు- 10,బండ్ ఫార్మర్ - 1,పవర్ వీడర్- 1, బ్రష్ కట్టర్స్ - 2,పవర్ టిల్లర్ -1,స్ట్రా బేలర్ - 2.అందుబాటులో ఉన్నాయి అని తెలిపారు.దీనిలో భాగంగా ఎస్సీ ఎస్టీ ,మహిళా, చిన్న సన్న కారు రైతులకు యాభై శాతం సబ్సిడీ , మిగతా రైతులకు నలభై శాతం మేర సబ్సిడీ అందించడం జరుగుతుంది అన్నారు .కావున వ్యవసాయ పరికరాలు పొందుట కొరకు రైతులు వ్యవసాయ విస్తరణ అధికారిని , మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలి అని తెలిపారు. దరఖాస్తు చేసుకొనుటకు కావలసిన పత్రాలు 1. దరఖాస్తు ఫారం ,2. ఆధార్ కార్డు జిరాక్స్ ,3. పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్,4. పాస్పోర్ట్ సైజ్ ఫొటో. తీసుకొని అక్టోబర్ 31వ తేదీ లోపు తీసుకొని రావాలి అన్నారు.

# రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన శివమణి

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామానికి చెందిన గడ్డి శివమణి,తండ్రి గడ్డి ఆనందం, రాష్ట్రస్థాయి అండర్ 19 వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల జరగ బోయే వాలీబాల్ పోటీలలో యాదాద్రి భువనగిరి జిల్లాలో 25,26, న జరుగుతున్న పోటీలో కరీంనగర్ జట్టుతో ఆడనున్నారు.



# రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**




ఇసుక తరలింపులో అక్రమాలకు పాల్పడిన రెండు ట్రాక్టర్లను ఇల్లంతకుంట పోలీసులు మరియు టాస్క్ ఫోర్స్ అధికారులు సంయుక్తంగా సీజ్ చేశారు. ఈ ఘటనలో ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులతో సహా మొత్తం ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో దాచారం గ్రామం వద్ద పోలీసులు, టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీ నిర్వహించింది.ఈ తనిఖీల్లో ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా ట్రాక్టర్ల యజమానులు తాసిల్దార్ ద్వారా ఇల్లంతకుంట మండలం ఆరేపల్లి గ్రామానికి ఇసుక తరలించడానికి అనుమతి కూపన్లను (పర్మిషన్) పొందినట్లు వెల్లడైంది. అయితే, వారు ఆరేపల్లికి తరలించకుండా, అనుమతి పొందిన గ్రామానికి కాకుండా దాచారం గ్రామానికి ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అనుమతిని దుర్వినియోగం చేస్తూ అక్రమంగా ఇసుక తరలింపునకు పాల్పడిన రెండు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. అలాగే, ఈ అక్రమ రవాణాకు బాధ్యులైన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. రహీంఖాన్ పేట గ్రామానికి చెందిన బిల్లవేణి శేఖర్, రహీంఖాన్ పేట గ్రామానికి చెందిన రుద్ర రాజశేఖర్, తిప్పాపూర్ గ్రామానికి చెందిన బెజ్జంకి శ్రీహరి ఉన్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సిరిసిల్ల అశోక్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

# జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలలో మెరిసిన అక్షయ్

**వేద న్యూస్, చొప్పదండి :**



నశా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం సందర్భంగా ప్రభుత్వ ఎస్.సి. హాస్టల్, చొప్పదండి లో 9వ తరగతి చదువుతున్న అక్షయ్ జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలలో 2వ బహుమతి సాధించాడు. అక్టోబర్ 2025 మత్తు పదార్థాల ప్రమాదాలపై అవగాహన కలిగించే అద్భుతమైన చిత్రాన్ని వేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాం అని వసతి గృహ సంక్షేమ అధికారులు మరియు సిబ్బంది, ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహం చొప్పదండి వార్డెన్ సత్యం అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ కుమార్, సిబ్బంది రవి శ్రీనివాస్ లు ఉన్నారు.

# కేయూలో నూతన భవనాల ప్రారంభోత్సవం



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ విశ్వవిద్యాలయ న్యూ పిజి హాస్టల్లో 40.00 లక్షలతో అదనపు కిచెన్ వసతిని కల్పించారు. శుక్రవారం కేయూ విసి ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ప్రారంభించారు. 3800 చదరపు అడుగులు విస్తీర్ణంలో 600 మంది విద్యార్థులకు అదనపు కిచెన్ అవసరాలను పూర్తిచేసారు. అదే విధంగా హ్యూమానిటీస్ బిల్డింగ్ లోని సెమినార్ హాల్ ను ఆధునీకరించారు, 1600 చదరపు అడుగులు విస్తీర్ణం, 135 సీటింగ్ సామర్థ్యంతో, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో 13 లక్షలతో ఆధునికరించామని కేయూ డెవలప్మెంట్ ఆఫీసర్ ఆచార్య ఎన్. వాసుదేవ రెడ్డి వెల్లడించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య టి.మనోహర్, వసతి గృహ సంచాలకులు డాక్టర్ ఎల్. పి.రాజ్ కుమార్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హెచ్ఆర్ఎం విభాగ అధిపతి డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, కేయూ పాలక మండలి సభ్యులు ఆచార్య బి. సురేష్ లాల్, డాక్టర్ ఎన్. సుదర్శన్, డాక్టర్ సుకుమారి, డాక్టర్ చిర్రా రాజు, అనితా రెడ్డి, ఆచార్య పి. మల్లారెడ్డి, ఆచార్య మామిడాల ఇస్తారి, ఆచార్య అమరవేణి, డాక్టర్ నరేందర్, డాక్టర్ మంజుల, బిల్డింగ్ డివిజన్ సిబ్బంది, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కర్నూలు బస్సు ప్రమాదంపై మంత్రి పొంగులేటి దిగ్భ్రాంతి

**వేద న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 24 (శుక్రవారం):**

హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఈరోజు తెల్లవారుజామున కర్నూలు సమీపంలో ప్రమాదానికి గురి కావడంపై తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన అత్యంత దురదృష్టకరం అని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) ఖాతా ద్వారా స్పందించారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఇబ్రహీంను కఠినంగా శిక్షించాలి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సత్య శారదకి గో రక్షణ,గోమాంస నిషేధ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించబడింది. అక్టోబర్ 22 మెడ్చల్ జిల్లా ఘట్కేసర్ వద్ద గోవులను అక్రమంగా తరలిస్తుండగా అడ్డుకున్న గోరక్షకుడు సోను (ప్రశాంత్)పై ఎంఐఎం గుండాలు తుపాకీతో కాల్పులు జరిపిన ఘటన రాష్ట్రాన్ని కుదిపేసింది. గోవులను రక్షించేందుకు కృషి చేస్తున్న కార్యకర్తపై తుపాకీ కాల్పులు జరగడం హిందూ ధర్మంపై, హిందువుల మనోభావాలపై దాడిగా పరిగణిస్తున్నాం. కాంగ్రెస్ పాలనలో ఎంఐఎం గుండాలు, అక్రమ మాంసం రవాణా మాఫియా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. చట్టాన్ని కాపాడాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వమే నేరస్థులను కాపాడుతోందన్నారు.

గోరక్షకుడిపై కాల్పులు చేసిన వ్యక్తి ఓల్డ్ సిటీకి చెందిన ఇబ్రహీం అని తెలిసినా ప్రభుత్వం మౌనం వహిస్తోంది. ఇది ఎంఐఎం, కాంగ్రెస్ మధ్య ఉన్న రాజకీయ స్నేహబంధానికి నిదర్శనం. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం గుండాలను ఎలా ప్రోత్సహిస్తుందో, గోరక్షకులపై హింసకు ఎలా వంతపాడుతుందో అనేదానికి నిదర్శనాలన్నారు. వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులు, రియల్ ఎస్టేట్ రంగం,



సాధారణ ప్రజలు అందరూ బెదిరింపులకు గురవుతున్నారు. ఎంఐఎం గుండాలకు లైసెన్స్ ఇచ్చిన పాలన- తెలంగాణను గన్ కల్చర్ రాజ్యంగా మార్చింది. చట్టాన్ని కాపాడాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వమే నేరస్థులను కాపాడుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, జిల్లా నాయకులు అంబాల రాంగోపాల్ గౌడ్, దువ్వ నవీన్, వంచనగిరి రాజ్ కుమార్, జెట్టింగ్ శివప్రసాద్ మరియు నాయకులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శనివారం అక్టోబర్ 25, 2025

# జిఎంయూతో ఒప్పందం


**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



వాషింగ్టన్ డిసి లోని యుఎస్ ఇండియా సాలిడారిటీ మిషన్ వ్యవస్థాపక చైర్మన్ శ్రీ పులి రవి చొరవతో వర్జీనియాలోని ఫెయిర్ ఫాక్స్‌లో ఉన్న జార్జ్ మాసన్ విశ్వవిద్యాలయం (జిఎంయూ) ప్రతినిధి బృందం వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంను సందర్శించింది. (జిఎంయూ) బృందంలో గ్లోబల్ ఎంగేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కమ్మీ సంఘేరా, కంప్యూటర్ సైన్స్ విభాగం అసోసియేట్ చైర్ డాక్టర్ రాబర్ట్ పెటిట్ ఉన్నారు. ఈ బృందం కేయూ విసి ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం, ప్రొఫెసర్ వెంకట్రామ్ రెడ్డి, ప్రొఫెసర్ పి. మల్లా రెడ్డి, ప్రొఫెసర్ ఎం. సదానందం, డాక్టర్ బి. రామ, డాక్టర్ డి. రమేష్, డాక్టర్ రమణ, డాక్టర్ బిక్షాలు వంటి సీనియర్ నిర్వాహకులతో విస్తృత చర్చలు జరిపింది. జిఎంయూ, కేయూల మధ్య విద్యార్థి, అధ్యాపక, పరిశోధన మార్పిడి కార్యక్రమాల కోసం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకునే అవకాశాలపై చర్చలు కేంద్రీకృతమయ్యాయి. రెండు సంస్థలు పరస్పర సహకారానికి పునాది వేయడానికి ప్రారంభ దశలో విద్యా పాఠ్యాంశాలను పంచుకోవడానికి అంగీకరించాయి. ఈసమావేశం సానుకూలంగా ముగిసింది.

# నగర రహదారుల సమాచార నమోదుకు అప్ రూపొందించండి

**వేద న్యూస్, వరంగల్:**



నగరం లోని రహదారుల సమాచార నమోదుకు అప్ రూపొందించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయం లో గల ఐసిసిసి కేంద్రాన్ని కమిషనర్ ఆకస్మికం గా సందర్శించి చెత్త వాహన కదలికల సమాచారాన్ని అడిగి తెలుసుకొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రధాన కార్యాలయం లో గల ఐసిసిసి కేంద్రం లో తెర ల పైన చెత్త తరలింపు వాహనాల కదలికలను ట్రాన్స్ఫర్ స్టేషన్ లలో కొనసాగుతున్న పనితీరు జిపిఎస్ ట్రాకింగ్ తో పాటు నగరం లోని పలు పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఐసిసిసి కేంద్రం ద్వారా వచ్చిన సమాచారాన్ని క్షేత్ర స్థాయిలో రివిల్ చేయాలని పోతన నగర్ సెకండ్ ట్రాన్స్ఫర్ ఫర్ స్టేషన్ కు వాహనాలు ఏ విధంగా వెళుతున్నాయి అని వాల్ వీడియో లలో పరిశీలించారు.ఐసిసిసి కేంద్ర సిబ్బంది తో మాట్లాడిన కమిషనర్ వారు చేయాల్సిన పని విధి విధానాలను అడిగి తెలుసుకున్నారు. నగరం లోని అన్ని ప్రాంతాలకు వెంటనే రూట్ మ్యాప్ ను ఆప్టిమైజేషన్ (సమర్థవంతం గా) చేసుకుని పెట్టాలని ఇందుకోసం ప్రత్యేకం గా అప్లికేషన్(అప్) తయారు చేసుకుని సిద్ధంగా ఉండాలని ఇందులో వాహనాల మరమ్మతులకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉండాలని ఏ వాహనం ఎక్కడ ఆగిన వెంటనే అలర్ట్ (హెచ్చరిక)వచ్చే విధంగా ఉండాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి,ఐ టి మేనేజర్ రమేష్,ఐసిసిసి ఇంచార్జి తేజస్వి,డిజిటల్ ఇంజనీర్ నవ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత, టీ -సేఫ్ అప్ పై అవగాహన

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**



నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో అందరు భాగస్వామ్యం కావాలని తమవంతు బాధ్యతలను నిర్వర్తించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల మహిళల మీద జరిగే నేరాలను అదుపు చేయవచ్చని సీఐ కే. సుజాత అన్నారు. వరంగల్ లోని ధ్రువ జూనియర్ కాలేజీ లో దాదాపు 200మంది విద్యార్థినిలతో సైబర్ నేరాలు, మహిళలపై జరిగే అత్యాచారాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ సందర్భంగా సీఐ కే.సుజాత మాట్లాడుతూ అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్, స్నాప్ చాట్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాల పై, తెలియని ప్రదేశాలకు ప్రయాణం చేయవలసి వచ్చినప్పుడు అందరు టీ–సేఫ్ ఆప్ ను

ఉపయోగించుకోవాలని, టీ–సేఫ్ ఆప్ పై అవగాహన కలిగి ఉండాలని, ఉద్యోగాలు చేసే మహిళలకు తాము పనిచేసే ప్రదేశాలలో అసభ్యకరంగా ప్రవర్తించే వారి పట్ల, ఆకతాయుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వారితో తమ వ్యక్తిగత విషయాలు పంచుకోరాదని సూచించారు. ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా వెంటనే షీ టీమ్ పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ1930 కి ఫిర్యాదు చేయాలని, మా షీ టీమ్ మొబైల్ నంబర్స్ సీపీ వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270కు ఫిర్యాదు చేసిన వారి వివరాలను చాలా గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ధ్రువ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆకుల. శ్రీనివాస్ మరియు ఆకుల సతీష్ ఉపాధ్యాయులు మరియు షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, కానిస్టేబుల్ రామ్ రెడ్డి, ఉమెన్ కానిస్టేబుల్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# ‘విద్య రాని వ్యక్తి విద్యా శాఖ మంత్రి’

అసెంబ్లీలో గట్టిగా మాట్లాడినా, దళిత మంత్రిగా ఉన్న భట్టి కూడా పట్టించుకోలేదని ఆయన పేర్కొన్నారు.

**– బీఆర్ఎస్ హయాంలోనే ఉద్యోగాలు**

లక్షా 64 వేల ప్రభుత్వ ఉద్యోగాలను బీఆర్ఎస్ ప్రభుత్వమే ఇచ్చిందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. గ్రూప్ 1, గ్రూప్ 2 ఆలస్యం అయ్యి ఉండవచ్చని అంగీకరిస్తూనే, 95 శాతం లోకల్ రిజర్వేషన్ సాధించిందీ, నోటిఫికేషన్లు ఇచ్చిందీ, పరీక్ష పెట్టిందీ, ఫిజికల్ టెస్ట్ పెట్టిందీ, ఎంపిక చేసిందీ అంతా బీఆర్ఎస్సే అని ఆయన పేర్కొన్నారు. కేవలం నియామక పత్రాలు ఇచ్చి, 60 వేల ఉద్యోగాలు ఇచ్చానని రేవంత్ రెడ్డి ప్రచారం చేసుకుంటున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు.

**– కేవలం 10 వేల ఉద్యోగాలే భర్తీ**

బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ల వివరాలను ఆయన ఉదహరించారు. ఇందులో 15,400 ఎస్సై కానిస్టేబుల్ నోటిఫికేషన్, 9 వేల గురుకులాల ఉద్యోగాలు, 8 వేల గ్రూప్ 4, హెల్త్ డిపార్టుమెంట్‌లో 7 వేల ఉద్యోగాలు, 1,300 జూనియర్ లెక్చరర్, 6 వేల టీచర్ల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్లు ఉన్నాయని తెలిపారు. అచ్చంగా కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేసింది కేవలం 10 వేల ఉద్యోగాలు మాత్రమే అని ఆయన పేర్కొన్నారు.

**– తక్షణమే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్**

వెంటనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోందని హరీశ్‌రావు తెలిపారు. నిరుద్యోగుల కోసం అసెంబ్లీ వేదికగా పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. మొన్న అసెంబ్లీ పెడితే ముఖ్యమంత్రి పారిపోయారని, ఇప్పుడు అసెంబ్లీ పెట్టడానికి కూడా భయపడుతున్నారని ఆయన విమర్శించారు. జెన్కో, జీపీవో, పోలీసు, డిప్యూటీ సర్వేయర్, ఇతర గ్రూప్స్ నోటిఫికేషన్ల కోసం బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని, అన్ని జిల్లా కేంద్రంలో బాకీ కార్డులు పెట్టి యువతను ఏకం చేస్తామని, ప్రత్యక్ష పోరాటం చేస్తామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. గతంలో తమ ప్రభుత్వం టీఎస్ ఐపాస్ ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించిందని, కానీ నేడు ఈ ప్రభుత్వం మంత్రులు, ముఖ్యమంత్రి గన్నులు పెట్టి బెదిరిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. రేవంత్ రెడ్డి గన్ ఇచ్చి పంపించాడు అని మంత్రి కుమార్తె చెప్పిందని, దీనివల్ల ఐఏఎస్ ఆఫీసర్ వీఆర్ఎస్‌తో మధ్యలోనే వెళ్లిపోతున్నారని ఆయన విమర్శించారు.

# ప్రజలకు ఆహ్లాదకర వాతావరణమే లక్ష్యం

ఆప్యాయంగా పలకరించారు. కూలీల యోగక్షేమాలు, పని ప్రదేశంలో వారికి లభిస్తున్న సౌకర్యాలను గురించి ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు, వారి పట్ల ఉన్న ఆయన మానవీయ కోణాన్ని ప్రదర్శించారు. కూలీలతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పార్క్ నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను అడిగారు. అంతేకాకుండా, కూలీల వ్యక్తిగత సమస్యలు, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, వేతనాలు, పని ప్రదేశంలో వారికి ఎదురవుతున్న ఇబ్బందుల గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలకు భరోసా ఇచ్చి, వారి కష్టానికి తగిన ఫలితం దక్కేలా చూస్తానని హామీ ఇవ్వడం జరిగింది.

ఈ ‘పెట్ అండ్ ప్లే పార్క్’ నిర్మాణం పూర్తి కావడం ద్వారా జూబ్లీహిల్స్ ప్రాంతంలోని ప్రజలకు మరియు పెంపుడు జంతువుల యజమానులకు ఇది ఒక చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తుంది. ప్రభుత్వ స్థలాలను రక్షించి, వాటిని ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి సంకల్పంలో భాగంగానే ఈ ఆకస్మిక తనిఖీ జరిగింది. ఈ చర్యలు పరిపాలనలో జవాబుదారీతనాన్ని, ప్రజలలో ప్రభుత్వ పాలనపై మరింత విశ్వాసాన్ని పెంచుతాయని భావిస్తున్నారు.

# గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య

ఇంటికి తీసుకెళ్లాలని మొరపెట్టుకుందని తోటి విద్యార్థులు తెలిపారు. తల్లిదండ్రులు వస్తున్నామని చెప్పినా, ఇంతలోనే ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటన స్థానికంగా మరియు విద్యార్థుల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది.ప్రమాదానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. వ్యక్తిగత సమస్యలే కారణమా, లేక పాఠశాలలో ఏదైనా ఒత్తిడి ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విద్యార్థిని తల్లిదండ్రులు మరియు బంధువులకు సమాచారం అందించగా, వారు పాఠశాల వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

పాఠశాలల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. విద్యా సంస్థలు విద్యార్థులకు మెరుగైన మానసిక మద్దతును అందించాల్సిన అవసరం ఉంది. ఆత్మహత్య ఆలోచనలు ఉన్నవారు లేదా మానసిక ఒత్తిడిలో ఉన్నవారు ఎవరైనా ఉంటే, తక్షణమే నిపుణుల సహాయం పొందాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. సహాయం కోసం 1800–599–0019 (కిరణ్ హెల్ప్‌లైన్) లేదా 104 (ఆసరా హెల్ప్‌లైన్) నెంబర్లను సంప్రదించవచ్చు.

# ఐక్యరాజ్య సమితి 80వ వార్షికోత్సవం

**వేద న్యూస్, న్యూ ఢిల్లీ, అక్టోబర్ 24 :**

ఐక్యరాజ్య సమితి 80వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర విదేశాంగ మంత్రి డా. ఎస్. జైశంకర్ శుక్రవారం న్యూ ఢిల్లీలో ఒక ప్రత్యేక స్మారక పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన బహుళపక్షవాద సంస్కరణ మరియు అంతర్జాతీయ సహకారం ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఐక్యరాజ్యసమితి దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**– శాంతి ఆవశ్యకతను చాటిన స్టాంప్ రూపకల్పన**

ఈ స్మారక స్టాంప్‌ను డిజైన్ చేయడానికి ఇండియా పోస్ట్ ఆఫీస్ నిర్వహించిన బహిరంగ పోటీ విజయవంతమైనందుకు మంత్రి జైశంకర్ వారిని అభినందించారు. ఈ స్టాంప్ ఆవిష్కరణ గురించి ట్వీట్ చేస్తూ, “ఈ స్టాంప్ సంఘర్షణల కాలంలో శాంతి యొక్క ఆవశ్యకతను సరిగ్గా తెలియజేస్తుంది” అని ఆయన పేర్కొన్నారు. ఈ పోస్టల్ స్టాంప్ అంతర్జాతీయ సమాజంలో శాంతిని నెలకొల్పడానికి ఐక్యరాజ్యసమితి పాత్ర యొక్క ప్రాముఖ్యతను దృశ్యమానం చేస్తుంది.

**– బహుళపక్షవాదం సంస్కరణల ఆవశ్యకత**

ప్రపంచంలో మారుతున్న రాజకీయ, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో, ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ వేదికలు తమ పనితీరును మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని జైశంకర్ నొక్కి చెప్పారు. ముఖ్యంగా, అభివృద్ధి చెందుతున్న దేశాల కూటమి అయిన గ్లోబల్ సౌత్ ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబించేలా బహుళపక్షవాదాన్ని సంస్కరించాల్సిన ఆవశ్యకతను ఆయన ఈ సందర్భంగా ప్రముఖంగా ప్రస్తావించారు. ఐక్యరాజ్యసమితి ఆదర్శాలకు మరియు మరింత మెరుగైన అంతర్జాతీయ సహకారానికి భారతదేశం బలంగా కట్టుబడి ఉంది అని డా. జైశంకర్ పునరుద్ఘాటించారు. వసుధైక కుటుంబం అనే స్ఫూర్తితో, ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో, ముఖ్యంగా వాతావరణ మార్పులు, ఉగ్రవాదం మరియు అభివృద్ధి లక్ష్యాల సాధనలో భారతదేశం తన వంతు కృషి చేస్తోందని ఆయన వివరించారు.

**– సాంస్కృతిక వారసత్వం మరియు సహకారం**

80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఐక్యరాజ్యసమితితో భారతదేశానికి ఉన్న బలమైన బంధాన్ని ఈ పోస్టల్ స్టాంప్ ఆవిష్కరణ కార్యక్రమం మరోసారి గుర్తు చేసింది. ఈ స్మారక స్టాంప్ ద్వారా, భారతదేశం కేవలం ఐరాస వ్యవస్థలో సభ్య దేశంగా మాత్రమే కాకుండా, ప్రపంచ శాంతి, సౌభ్రాతృత్వ సందేశాన్ని ప్రచారం చేసే సాంస్కృతిక వారసత్వాన్ని కూడా ముందుకు తీసుకువెళ్తుందని జైశంకర్ తెలియజేశారు.

# పాకిస్థాన్‌కు మరో భారీ షాక్

వందలాది మంది మరణించిన కొన్ని వారాలకే అఫ్గానిస్థాన్ ఈ సంచలన నిర్ణయం తీసుకోవడం గమనార్హం ఆఫ్ఘన్ జల, ఇంధన మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. విదేశీ సంస్థల కోసం ఎదురుచూడకుండా, దేశీయ కంపెనీలతోనే ఒప్పందాలు కుదుర్చుకోవాలని సుప్రీం లీడర్ స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు సమాచార శాఖ ఉప మంత్రి ముహాజెర్ ఫరాహీ ‘ఎక్స్’ వేదికగా తెలిపారు. “భారత్ తర్వాత, ఇప్పుడు పాకిస్థాన్‌కు నీటి సరఫరాను పరిమితం చేసే వంతు ఆఫ్ఘనిస్థాన్‌కు వచ్చినట్లుంది” అని లండన్‌కు చెందిన ఆఫ్ఘన్ జర్నలిస్ట్ సామి యూసఫ్‌జాయ్ వ్యాఖ్యానించడం ఈ పరిణామం యొక్క తీవ్రతను తెలియజేస్తుంది.

**– పాకిస్థాన్‌పై తీవ్ర ప్రభావం**

ఆఫ్ఘనిస్థాన్‌లోని హిందూకుష్ పర్వతాల్లో పుట్టే 480 కిలోమీటర్ల పొడవైన కునార్ నది, పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోకి ప్రవేశించి కాబూల్ నదిలో కలుస్తుంది. కునార్ నదిపై డ్యామ్ నిర్మిస్తే, దాని ప్రభావం కాబూల్ నదిపై, ఆ తర్వాత సింధు నదిపై పడుతుంది. దీంతో పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వాతో పాటు పంజాబ్ ప్రావిన్స్‌లో కూడా సాగునీరు, తాగునీటి అవసరాలకు తీవ్ర సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉంది. ఈ నిర్ణయంతో పాకిస్థాన్ తీవ్ర నీటి సంక్షోభంలో కూరుకుపోయే అవకాశం ఉంది.

**– ‘జల సార్వభౌమత్వం’పై తాలిబన్ దృష్టి**

2021లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తాలిబన్లు తమ దేశ లిలి”జల సార్వభౌమత్వం”లిలిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇంధన ఉత్పత్తి, సాగునీటి కోసం పొరుగు దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడమే లక్ష్యంగా డ్యామ్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేశారు. మరోవైపు, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మధ్య నీటి పంపకాలపై ఎలాంటి అధికారిక ఒప్పందం లేదు. ఈ ఏకపక్ష నిర్ణయాలు ప్రాంతీయంగా తీవ్ర నీటి సంక్షోభానికి దారితీయవచ్చని పాకిస్థాన్ గతంలోనే ఆందోళన వ్యక్తం చేసింది.

**– భారత్‌తో స్నేహం.. పాక్‌తో కయ్యం**

వారం రోజుల క్రితమే ఆఫ్ఘన్ విదేశాంగ మంత్రి మౌల్వీ ఆమిర్ ఖాన్ ముత్తాఖీ భారత్‌లో పర్యటించి, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య జలవిద్యుత్ ప్రాజెక్టులు, డ్యామ్‌ల నిర్మాణంపై సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. ఒకవైపు భారత్ సహాయంతో సల్మా డ్యామ్, షహతూత్ డ్యామ్ ప్రాజెక్టులను చేపడుతూనే, మరోవైపు పాకిస్థాన్‌కు ప్రవహించే నీటిని నియంత్రించాలని తాలిబన్లు నిర్ణయించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073